క్లుప్తంగా

స్వాతి నక్షత్ర మహోత్సవం


యాగం నిర్వహిస్తున్న అర్చకులు

వర్గల్(గజ్వేల్): శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రంలో బుధవారం స్వాతి నక్షత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రం పురస్కరించుకుని మూలవిరాట్టుకు విశేష అభిషేకం నిర్వహించారు. యాగశాలలో మూలమంత్ర హవనం, పూర్ణాహుతి జరిపారు. వేడుకలలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

క్రీడోత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హుస్నాబాద్: గ్రామీణ, పట్టణ విద్యార్థులకు ప్రోత్సహించడానికే క్రీడలు నిర్వహిస్తున్నామని హుస్నాబాద్ ఖేల్ కన్వీనర్ అంజి అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో క్రీడోత్సవ్ –2025 పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 27 నుంచి 30 వరకు స్వామివివేకానంద, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఈ క్రీడలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాకేశ్, రాజేశ్, చరణ్, వెంకటేశ్, వంశీ పాల్గొన్నారు.

పునరావాసం కోసం గ్రామస్తుల ఆందోళన


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

చిన్నకోడూరు(సిద్దిపేట): ఒక వైపు అంతగిరి రిజర్వాయర్, మరోవైపు అదనపు టీఎంసీ కాలువ నిర్మాణంతో గ్రామంలో ఉండలేకపోతున్నామని మండల పరిధిలోని చెలుకలపల్లి గ్రామస్తులు బుధవారం పంప్‌హౌస్ వద్ద ఆందోళనకు దిగారు. వారు మాట్లాడుతూ అంతగిరి రిజర్వాయర్ వల్ల ఇళ్లలోకి నీళ్లు, కీటకాలు వస్తున్నాయన్నారు. అదనపు టీఎంసీ నిర్మాణంలో చేపట్టే బ్లాస్టింగ్‌లతో ఇళ్లపై రాళ్లు పడుతున్నాయని, గ్రామానికి రావడానికి సరైన రోడ్డు మార్గం లేదని వాపోయారు. గుంతల రోడ్డుతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు స్పందించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు.

సోలార్ ప్లాంట్ కోసం స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న జయదేవ్‌ఆర్య

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని బెక్కల్ గ్రామంలోని రామలింగేశ్వర ఆలయం వద్ద ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్ కోసం డీఆర్డీఓ పీడీ జయదేవ్ ఆర్య బుధవారం స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో 3 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విశ్వనాథశర్మ, చైర్మన్ మల్లేశం పాల్గొన్నారు.

విద్యార్థినికి సీపీ అభినందన


విద్యార్థిని అభినందిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సోషల్ టాలెంట్ టెస్టులో రెండో స్థానంలో నిలిచిన ఇర్కోడ్ మోడల్ స్కూల్ పదో తరగతి విద్యార్థి భార్గవ్‌ను సీపీ అనురాధ బుధవారం అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవీందర్‌గౌడ్, సిబ్బంది స్నేహలత, శ్రీదేవి, లలిత తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సిద్దిపేటఅర్బన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని బీజేపీ బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్య అన్నారు. బుధవారం స్థానిక హోటల్‌లో తపస్ ఉపాధ్యాయ సంఘం నాయకులు, బీజేపీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మల్లన్నను దర్శించుకొని ప్రచారం ప్రారంభించామని చెప్పారు. సంగారెడ్డి బీజేపీ అధ్యక్షురాలు గోదావరి, తపస్ నాయకులు రఘువర్ధన్ రెడ్డి, మురళీధర్, సురేశ్, శ్రీనాకర్ రెడ్డి, నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, మార్కండేయులు, నరేశ్ పాల్గొన్నారు.

చిక్కుడు.. లాభాలు బోలెడు

- పెట్టుబడి, శ్రమ తక్కువ
- మార్కెట్‌లో మంచి డిమాండ్
- ఆరుతడి పంటగా సాగు
- ఆసక్తి చూపుతున్న రైతులు

మిరుదొడ్డి(దుబ్బాక): తక్కువ నీటి వనరులు, తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో చిక్కుడు సాగుచేయడానికి అవకాశాలు ఎక్కువ. లేత చిక్కుడు కాయలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. దీంతో చిక్కుడు సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఆరుతడి పంటగా ఈ సాగును ఎంచుకుంటున్నారు. సాగులో సమగ్రమైన సస్య రక్షణ చర్యలు చేపడితే చిక్కుడు సాగులో మంచి దిగుబడులు సాధించడమే కాకుండా స్వయంగా మార్కెటింగ్ చేసుకుంటూనే ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి మల్లేశం తెలిపారు. అధిక దిగుబడి, లాభాలు గడించడానికి చిక్కుడులో చేపట్టాల్సిన అంశాలపై ఆయన ఇచ్చిన సలహాలు, సూచనలు.


మండలంలో ఓ రైతు సాగుచేసిన చిక్కుడు

చిక్కుడులో రకాలు:

- 1. పందిరి రకాలు 2.పాద రకాలు
- పందిరి రకాల్లో పూసా ఎర్లీ ప్రొలిప్- 2, 3, ఆర్ ఎన్‌డీ–1 రకాలు ఉన్నాయి. పాద రకాల్లో అర్క జయ, అర్కవిజయ రకాలు ఉన్నాయి.

విత్తుకునే సమయం:

ఆరుతడి కింద జనవరి–ఫిబ్రవరి నెలల్లో విత్తుకుంటే మంచి దిగుబడులు వస్తాయి.

- **విత్తన మోతాదు:** ఎకరానికి పందిరి రకాలు 0.8–12 కిలోలు, పాద రకాలకు 12–16 కిలోల విత్తనాలు సరిపోతాయి.
- **శుద్ధిచేసే విధానం:** కిలో విత్తనానికి 4 గ్రా. ట్రైకోడెర్మాతో 3 గ్రా. కాప్టాన్ లేదా థైరమ్‌తో విత్తన శుద్ధి చేయాలి.
- **నేల తయారీ విధానం:** నేలను నాలుగు సార్లు మెత్తగా దున్నుకోవాలి. పందిళ్లపై సాగుచేసే చిక్కుడు పంటకు 2–2.5 మీ. దూరంలో కాలువలు తయారుచేసి 1.5–2.0 మీ. దూరంలో పాదులు ఏర్పాటు చేసుకోవాలి.
- **విత్తుకునే విధానం:** ఒక్కో పాదులో 30 3–4 విత్తనాలు పెట్టుకోవాలి. 30 30 30 సెం.మీ. గుంతల్లో విత్తిన తర్వాత వెంటనే నీరు కట్టాలి.
- **ఎరువులు వేసుకునే విధానం:** విత్తడానికి ముందు ఒక ఎకరానికి బాగా మాగిన 4–5 టన్నుల పశువుల ఎరువును నేలలో కలియదున్నుకోవాలి. విత్తిన తర్వాత ఎకరానికి 24కిలోల భాస్వరం 12కిలోల పొటాష్‌తో పాటు మొదటి దఫా 15కిలోల నత్రజనిని వేయాలి. 30రోజుల వ్యవధిలో 15కిలోల నత్రజనిని రెండో దఫాగా వేయాలి. ఎరువులు వేసిన వెంటనే నీటితడిని అందించాలి.


మల్లేశం, మండల వ్యవసాయ అధికారి, మిరుదొడ్డి

- **అంతర కృషి:** కలుపు నివారణకు పెండిమిథాలిన్ మందును ఎకరానికి 1.25 లీ. లేదా, అలాక్లోర్ 1.0 లీ. చొప్పున 200 లీ. నీటితో కలిపి నాటిన రెండు రోజుల్లోగా నేలపై పిచికారీ చేయాలి. పాదులను మట్టితో గుళ్లగా చేసుకోవాలి. తీగసాగే దశలో తగినంత తాళ్లతో పందిరిపైకి పాకే విధంగా చర్యలు చేపట్టాలి.


కాచిన కాయలు

- **నీటి యాజమాన్యం:** నీరు కట్టేటప్పుడు పాదుల్లో నీరు నిలవకుండా చూడాలి. వర్షాలు అనుకూలంగా లేనప్పుడు 10–15 రోజుల వ్యవధిలో నీటిని అందించాలి.

సస్యరక్షణ చర్యలు

- పెంకు పురుగులు: పెంకు పురుగులు ఆకులను కొరికి తింటాయి. వాటి నివారణకు కార్బరిల్ 2.5 గ్రా. లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పేనుబంక, తామర పురుగులు: ఆకులు, పూలను ఆశించి రసాన్ని పీలుస్తాయి. దీంతో మొక్కలు పండుబారడంతోపాటు గిడసబారుతాయి. వాటి నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ లేదా ఫిప్రోనిల్ మందు 2మి.లీ. లీటర్ నీటికి కలిపి 10రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి.
- కాయతొలుచు పురుగులు: పూత కాత దశల్లో ఈ పురుగులు ఆశించి పంటకు నష్టం కలిగిస్తాయి. కాయల్లోని పదార్థాన్ని తినడం వల్ల కాయల నాణ్యత తగ్గిపోతుంది. వాటి నివారణకు ఎండోసల్ఫాన్ లేదా మాలాథియాన్ 2మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్లు.

- తుప్పు, ఆంత్రాక్నోస్, ఆకుమచ్చ తెగులు: ఈ తెగుళ్లు ఆశించడం వల్ల ఆకులు, కాయలపై మచ్చలు ఏర్పడతాయి. తద్వారా కాయల నాణ్యత తగ్గిపోవడంతో పాటు మొక్కల పెరుగుదల ఆగిపోతుంది. వాటి నివారణ కోసం కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- వేరుకుళ్లు తెగులు: మొక్కల మొదళ్లు కుళ్లిపోతాయి. విత్తనాన్ని థైరమ్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధిచేసి విత్తడం వల్ల వేరుకుళ్లు తెగులును నివారించవచ్చు.
- దిగుబడి: విత్తిన 120 నుంచి 130 రోజుల్లో మొదటి దిగుబడి వస్తుంది. పందిరి తీగ రకాలైతే ఎకరానికి 3 నుంచి 5 టన్నులు, పాద రకాలైతే 1.5 నుంచి 2.5 టన్నుల దిగుబడి వస్తుంది. కాయలు ముదిరిపోక ముందే లేతగా ఉన్నప్పుడే కోసి మార్కెట్‌కు తరలించాలి.

హరీశ్‌రావుకు ఆహ్వానాలు

సిద్దిపేటజోన్: పలు దేవాలయాల్లో జరగనున్న ఉత్సవాలకు హాజరుకావాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు బుధవారం పలువురు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఇరుకోడ్ శివారులో నిర్మించిన హనుమాన్ ఆలయ విగ్రహ ప్రతిష్ఠకు రావాలని, దుద్దేడ గ్రామంలో స్వయంభూ శంభు దేవాలయంలో 24నుంచి జరగనున్న వేడుకల్లో పాల్గొనాలని గ్రామస్తులు ఆహ్వాన పత్రికలు అందజేశారు. సుడా మాజీ చైర్మన్ రవీందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికను అందిస్తున్న గ్రామస్తులు

ఉమేశ్‌చంద్రకు పరామర్శ

చిన్నకోడూరు(సిద్దిపేట): మాజీ సర్పంచ్, బీఆర్‌ఎస్ నాయకుడు కామిని ఉమేశ్‌చంద్రకు ఇటీవల గుండె సబంధిత శస్త్రచికిత్స జరగడంతో హరీశ్‌రావు ఆయనను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని మనోధైర్యం కల్పించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పాపయ్య, వేణు, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయి

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకరూరల్: ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి స్వగ్రామమైన మండలంలోని పోతారం గ్రామస్తుడు సల్కం మల్లేశం సహకారంతో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే స్టీల్ వాటర్ బాటిళ్లు అందజేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. మల్లేశంను అభినందించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ప్రారంభించారు. అదేవిధంగా అక్బర్‌పేటభూంపల్లి మండలం శ్రీకూడవెల్లి రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం జాతర ఏర్పాట్లను పరిశీలించా రు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవి, కృష్ణ పాల్గొన్నారు.


వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్య

దేనికైనా వెనుకాడ..

దుబ్బాక/మిరుదొడ్డి(దుబ్బాక): తనను నమ్మి గెలిపించిన ప్రజల కోసం ఏ త్యాగానికైనా వెనుకాడనని ఎమ్మెల్యే అన్నారు. వెంకటయ్యతో కలిసి తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అదేవిధంగా మిరుదొడ్డిలో అనారోగ్యంతో బాధపడుతున్న పసులకాడి సంధ్య, ఎండీ రహిమొద్దీన్, లత, సత్తు రాజిరెడ్డి, బాలమల్లు తదితరులకు మంజూరైన చెక్కులను అందజేశారు. లింగం, భైరయ్య, రమేశ్, యాదాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా, జైలు శిక్ష విధించింది. టూటౌన్ సీఐ ఉపేందర్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 27 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి బుధవారం వారికి రూ.64,500 జరిమానా, వారిలో ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

ఒకరికి జైలు

కొండపాక(గజ్వేల్): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒక వ్యక్తికి రెండు రోజులు జైల్ శిక్ష పడినట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ తెలిపారు. పోలీస్టేషన్ పరిధిలోని తనిఖీ చేయగా 8 మంది మద్యం తాగి నడుపుతూ పట్టుపడగా వారిని కోర్టులో హాజరు పర్చారు. న్యాయమూర్తి కాంతారావు ఏడుగురికి రూ.17.500లకు జరిమానా, ఒకరికి రెండు రోజుల జైలు శిక్షను విధించారని సీఐ చెప్పారు.

వెంకటయ్య పరామర్శ

సిద్దిపేటకమాన్: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మెరుగు మహేశ్ తండ్రి పార్టీ సీనియర్ నాయకులు మల్లేశం అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో లింగారెడ్డిపల్లిలోని వారి కుటుంబాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మాజీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ బుధవారం పరామర్శించారు. వారి వెంట నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, సోమిరెడ్డి, ఎల్లారెడ్డి, సంపత్, మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మున్సిపల్ సమావేశం

చేర్యాల(సిద్దిపేట): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్వరూపరాణి అధ్యక్షతన బుధవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం జరిగింది. పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్య నిర్వహణపై పాలకవర్గ సభ్యులు చర్చించి తీర్మానాలు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ నాగేందర్ తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ రాజీవ్‌రెడ్డి, కౌన్సిలర్లు లింగం, చంటి, నరేందర్, కనకవ్వ, జుబేదా ఖాతూన్, ఇన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు విద్యుత్‌కు అంతరాయం

ములుగు(గజ్వేల్): మండలంలోని కొక్కొండ సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొక్కొండ గ్రామం, పరిశ్రమలకు ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

◆ అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రొటోకాల్ పేరుతో బీఆర్‌ఎస్ నాయకులు అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్ స్వామి గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పది సంవత్సరాల పాటు ఏ అర్హత లేని బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని ఇప్పుడు ప్రొటోకాల్ గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. నాయకులు సుమలత, బాలాగౌడ్, ప్రతాప్, భూమయ్య, బాలాగౌడ్, మల్లేశం, భూపాల్‌రెడ్డి, ప్రభాకర్‌చారి, రమేశ్, సురేందర్‌రెడ్డి, చందు తదితరులు పాల్గొన్నారు.

◆ పథకాలను వినియోగించుకోండి

సిద్దిపేటరూరల్: దివ్యాంగులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రవేశపెట్టిన ఉపాధి, పునరావాస పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమశాఖ అధికారి జి.లక్ష్మీకాంత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు 23 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

◆ కళాశాల అభివృద్ధికి కృషి

గజ్వేల్‌రూరల్: కళాశాల అభివృద్ధికి కృషిచేస్తామని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, సీపీడీసీ మెంబర్లు చెప్పారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ అనితా అబ్రహం ఆధ్వర్యంలో బుధవారం సీపీడీసీ(కాలేజ్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్) సమావేశం నిర్వహించారు. సభ్యులు లక్ష్మణ్, పరమేశ్వరచారి, నరేష్‌బాబు, శైలజ, శ్రీధర్, వైస్‌ప్రిన్సిపాల్ కమలా క్రిస్టియాన తదితరులు పాల్గొన్నారు.

◆ స్టడీ మెటీరియల్ పంపిణీ

సిద్దిపేటఎడ్యుకేషన్: కేంద్ర పోలీస్ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు సైనిక గ్రూప్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. గ్రూప్ ప్రతినిధి లోకేశ్ మాట్లాడుతూ మెటీరియల్‌ను ఉపయోగించుకుని ఇప్పటికి 100మందికి పైగా ఉద్యోగాలను సాధించారన్నారు. గ్రూప్ సిద్దిపేట ఇన్‌చార్జి అజయ్‌కుమార్, పవన్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ మత్తు పదార్థాలపై అవగాహన అవసరం

కోహెడ(హుస్నాబాద్): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హుస్నాబాద్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్‌ఐ దామోదార్ సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి, ఆబ్కారీ సిబ్బంది పాల్గొన్నారు.

రెండో రోజూ రసాభాస

గ్రామసభల్లో వినతుల వెల్లువ

- అధికారులను నిలదీసిన ప్రజలు

రెండోరోజు అధికారులు నిర్వహించిన గ్రామ, వార్డు సభలు రసాభాసగానే సాగాయి. తమ పేర్లు జాబితాల్లో లేవంటూ స్థానికులు బుధవారం అధికారులను నిలదీశారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలంలోని మైసమ్మవాగుతండాలో నిర్వహించిన గ్రామ సభలో లబ్ధిదారుల ఎంపిక జాబితాలో తమ పేర్లు ఎందుకు రాలేదని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. సర్వే సరిగా చేయలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం ఎంపీఓ మోహన్‌నాయక్, ఏఎస్‌ఓ చామంతి, ఏఈఓలు శ్రీలత, సింధూజ, పంచాయితీ కార్యదర్శులు స్వరూప, చిరంజీవి, రవీందర్, కార్తీక్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అయిలయ్య పాల్గొన్నారు.

తిగుల్ గ్రామసభలో

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని తిగుల్, లింగారెడ్డిపల్లి, కొత్తపేట, బస్వాపూర్, రాంచంద్రాపూర్, మునిగడప గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. తిగుల్‌గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద లబ్ధిదారుల పేర్లను ఎంపీడీఓ యాదగిరి చదివి వినిపించగా కొందరికే ఇస్తారా అంటూ స్థానికులు అధికారులను నిలదీశారు. దీంతో సీఐ మహేందర్‌రెడ్డి వారిని సముదాయించారు. వివిధ నాయకులు భానుప్రకాశ్‌రావు, మహేందర్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణమోహన్, ఏఓ వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పహారాలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని అయినాపూర్‌లో నిర్వహించిన సభలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ లబ్ధిదారుల పేర్లు చదవకుండా ప్రజాపాలనకు దరఖాస్తు చేసుకున్న713మంది అర్హులే అని చెప్పడంతో సభలో గందరగోళం చోటు చేసుకుంది. ఒకే గ్రామంలో 713 మందికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం ఎలా సాధ్యం అని గ్రామస్తులు ప్రశ్నించారు. దీంతో ఎస్ఐ రాజు సిబ్బందితో అక్కడికి చేరి సభను అడ్డుకోవద్దని విజ్ఞప్తి చేశారు. పోలీసుల ప్రహారాలో సభను కొనసాగించడంతో గ్రామస్తులు మండిపడుతున్నారు.

బయ్యారం సభలో వాగ్వాదం

గజ్వేల్: మండలంలోని బయ్యారంలో నిర్వహించిన సభలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయలేదంటూ బీఆర్‌ఎస్ నాయకులు, గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. సీఐ సైదా సభ వద్దకు చేరుకొని సముదాయించారు.

చంద్లాపూర్‌లో గందరగోళం

చిన్నకోడూరు(సిద్దిపేట): చంద్లాపూర్‌లో నిర్వహించిన గ్రామసభలో అనర్హులను ఎంపిక చేశారంటూ గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ల మంజూరు చేస్తానని పంచాయతీ కార్యదర్శి డబ్బులు వసూలు చేశాడని, తీరా జాబితాలో తమ పేర్లు లేకపోవడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.వెయ్యి నుంచి పదివేల వరకు వసూలు చేశారని ఆరోపించారు.


నంగునూరు(సిద్దిపేట): అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్తులు

గ్రామస్తుల ఆందోళన

బెజ్జంకి(సిద్దిపేట): గాగిల్లాపూర్‌లో ఈజీఎస్‌లో పనులు కల్పించకపోవడం వల్లే ఆత్మీయ బరోసా పొందలేక పోతున్నామని పలువురు గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ మాట్లాడుతూ అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని, ఆందోళన చెందవద్దని చెప్పారు. గూడెంలో అనర్హులకు చోటు కల్పించారని, రైతు భరోసా 12వేలకు తగ్గించారని ఆందోళన చేశారు. వడ్లూరులో రైతుబంధు తగ్గింపుపై ప్రశ్నించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ అంజయ్య, ఏఓ సంతోష్, ఎంపీఓ మంజుల పాల్గొన్నారు.

అర్హులకు అన్యాయం చేస్తారా

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట, గణపూర్, సిద్దన్నపేట, మగ్దుంపూర్, వెంకటాపూర్, ఖానాపూర్, బద్దిపడగ, ఖాత గ్రామాల్లో గ్రామసభలలో అధికారులు అర్హుల జాబితా ప్రకటించారు. దరఖాస్తులు చేసుకున్నా జాబితాలో పేర్లు లేవని, తమకు అన్యాయం చేస్తారా అన్ని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. రాజగోపాల్‌పేటలో జరిగిన సభలో అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజలు గ్రామసభ బహిష్కరిస్తున్నట్లు అధికారులకు వినతి పత్రం అందజేశారు.

రసాభసాగా గ్రామసభలు

తొగుట(దుబ్బాక): మండల ప్రత్యేకాధికారి కె.మల్లయ్య ఆధ్వర్యంలో తుక్కాపూర్, ఎల్లారెడ్డి,పేట, వెంకట్రావుపేట, రాంపురం, గుడికందుల గ్రామాల్లో జరిగిన సభలు గందరగోళంగా మారాయి. జాబితాలో అనర్హుల పేర్లు ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద భవంతులు ఉన్న వారిని ఎలా ఎంపిక చేశారని వెంకట్రావుపేట సభలో గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

చెప్యాలలో..

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని చెప్యాలలో మండల వ్యవసాయ అధికారి మల్లేశం, ఆర్ఐ కొండల్‌రెడ్డి, ఈజీఎస్ అధికారులు సభ నిర్వహించారు. అర్హులైన వారి జాబితాను చదివి వినిపించారు. పేర్లు లేనివారి నుంచి దరఖాస్తులు తీసుకుంటామని వారు చెప్పారు.

బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు

డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నేతల మాటలు నమ్మొద్దని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సూచించారు. పలు వార్డుల్లో నిర్వహించిన ప్రజాపాలన సభల్లో పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పథకాలను ప్రజలకు అందకుండా బీఆర్‌ఎస్ నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మధు, గయాజొద్దీన్, సలీం, ఫయాజ్, ఫయాజుద్దీన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలి: ఎమ్మెల్సీ

మర్కూక్(గజ్వేల్): అర్హులైన వారిని పారదర్శకంగా ఎంపికచేసి సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చొరవచూపాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవరెడ్డి సూచించారు. మండలంలోని దామరకుంట, కర్కపట్ల, చేబర్తి, గణేష్‌పల్లి గ్రామాలలో నిర్వహించిన గ్రామసభలలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు కనకయ్య, మల్లేశం, యాదగిరి, ఎంపీడీఓ అశోక్, తహసీల్దార్ ఆరిఫా తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి: ఏసీపీ

కొండపాక(గజ్వేల్): గ్రామసభలను ప్రజలు సద్వియోగం చేసుకోవాలని ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. కుకునూరుపల్లి మండలంలోని మంగోల్‌లో నిర్వహించిన గ్రామసభను ఆయన పరిశీలించారు. శాంతియుతంగా సభలు సాగేలా ప్రజలు సహకరించాలని కోరారు. తొగుట సీఐ లతీఫ్, మాజీ సర్పంచ్ కిరణ్‌కుమార్‌చారి, ఎస్ఐ శ్రీనివాస్, నర్సింహాచారి, రవీందర్, బాపురెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.


గజ్వేల్: కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న నర్సారెడ్డి

కట్‌చేసే స్కీములు కావు: ఆర్డీఓ

హుస్నాబాద్: పేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ప్రభుత్వ స్కీంలు ఇచ్చేవే కానీ కట్ చేసేవి కావని ఆర్డీఓ రామ్మూర్తి అన్నారు. 6 నుంచి 10వ వార్డు వరకు సభలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబితాలో పేర్లు రాని వారు ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, వైస్ చైర్ పర్సన్ అనిత, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను రెచ్చగొడుతున్నారు: డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగరాజు

చిన్నకోడూరు(సిద్దిపేట): పథకాలు పేదలకు అందకుండా చేయడానికి వారిని రెచ్చగొట్టి తప్పుదోవ పట్టేలా బీఆర్‌ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నారని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు ఆరోపించారు. బుధవారం చిన్నకోడూరులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పేదలకు అందకుండా గ్రామసభల్లో గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. నర్సయ్య, సంపత్, నాగరాజు, ప్రశాంత్ రెడ్డి, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేవంత్ రెడ్డి గురించి మాట్లాడం సిగ్గుచేటు: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నేత గోపీకృష్ణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేని బీఆర్‌ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి గురించి మాట్లాడటం సిగ్గుచేటుగా ఉందని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపీకృష్ణ మండిపడ్డారు. పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రజలకు లబ్ధి చేకూర్చేందుకు కృషిచేయాలని సలహా ఇచ్చారు. నాయకులు వాహబ్, వంశీ, జునైద్, రాజిరెడ్డి, అనిల్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్, చోట అజ్మత్, ప్రతాప్, ప్రవీణ్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తే సురక్షిత ప్రయాణం

పోలీసు అధికారులు

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని పోలీసులు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు బుధవారం ఉత్సాహంగా కొనసాగాయి. నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు.

చేర్యాల(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్/అక్కన్నపేట(హుస్నాబాద్)/గజ్వేల్‌రూరల్/ములుగు(గజ్వేల్)/సిద్దిపేటకమాన్: చేర్యాలలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ క్రిస్టోఫర్, సిద్దిపేటలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శంకర్‌నారాయణ, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి, అక్కన్నపేట మండలంలోని కపూర్‌నాయక్ తండా గ్రామంలో ఎస్ఐ విజయ్‌భాస్కర్, ములుగు మండలంలోని అన్నసాగర్ గ్రామంలో ఎస్ఐ విజయ్‌కుమార్, సిద్దిపేట ప్రభుత్వాసుపత్రి వద్ద సిద్దిపేట ట్రాఫిక్ ఏఎస్ఐలు ఉమేష్, సదాశివరావు తదితరులు డ్రైవర్లు, వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో ఏఎంవీఐ శ్రీకాంత్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ జితేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ విక్టోరియా, హోంగార్డ్ నరేశ్, కానిస్టేబుళ్లు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.